క్లుప్తంగా

అభివృద్ధి చూసే బీఆర్‌ఎస్‌లో చేరికలు

వనపర్తి: బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధి చూసే వివిధ పార్టీలకు చెందిన నాయకులు గులాబీ కండువా వేసుకుంటున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో రాజపేట పెద్దతండాకు చెందిన చందూనాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 40 మంది, పెద్దమందడి మండలం బేడ బుడగ జంగాల మండల అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో 50 మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు



వనపర్తి: జిల్లా కేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లింలు క్షేమంగా వెళ్లి రావాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్లో హజ్‌యాత్రకు వెళ్తున్న ముస్లింలకు వైద్య పరీక్షలు చేసి టీకాలు ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ, మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గాండ్ల రఘు, జిల్లానాయకులు మెకానిక్ షబ్బీర్, గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలను గుర్తించి నిత్యావసర సరుకులను అందిస్తున్నట్లు తెలిపారు. మస్‌జిదేనూర్ సమీపంలో నివాసముంటున్న యాసీన్ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని విషయం తెలుసుకుని నిత్యావసర సరుకులతో పాటు నగదును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిరంజన్, కుర్షీద్, ఖాజ, అక్బర్, బుచ్చన్న, నర్సింహ, కృష్ణ, హరీష్‌గౌడ్ ఉన్నారు.

కనీస వసతులు కల్పించాలి



చిన్నంబావి: మండలంలోని కొల్లూరులో ఉపాధి హామీ కూలీలకు సకాలంలో కూలి డబ్బులను వారి ఖాతాల్లో జమ చేస్తున్నారా లేదా అనే విషయాలను బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొగ్గు కుర్మయ్య మంగళవారం ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు వారికి అందుతున్న కనీస వసతులు, పని ప్రదేశంలో అందే మౌలిక సదుపాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి కర్తాల కృష్ణయ్య, చిన్నంబావి మండల ఓబీసీ ప్రధాన కార్యదర్శి జింకల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



కొత్తకోట: మండల కేంద్రంతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు 'రిలయన్స్ ట్రెండ్స్' ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజంలో గౌరవంగా బతకాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విధంగా చదవుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ ట్రెండ్ స్టోర్ మేనేజర్ శివకుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

గోపాల్‌పేట: మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధుడు ఇంటి నుంచి వెళ్లి మూడు రోజులైనా తిరిగి రాలేదని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన రేకులపాడు నాగన్న అనే వృద్ధుడు శనివారం ఇంటి నుంచి వెళ్లి మంగళవారం వరకు కూడా ఇంటికి రాలేదు. తెలిసిన వారి ఇళ్లు, బంధువుల ఇళ్ల వద్ద చూసినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు

వనపర్తి టౌన్: మున్సిపల్ పరిధిలో జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేసేందుకు మహిళా సంఘాలను సంఘటితం చేయడంలో ఆర్పీలు కీలక పాత్ర వహించాలని కమిషనర్ విక్రమసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉత్సవాల సన్నాహక సమావేశం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఇంటి నుంచి మహిళలు ఉత్సవాలకు తరలి వచ్చేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఆర్పీలు ప్రతి ఒక్క మహిళతో పది మొక్క లు నాటించే కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని కోరారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు బాలరాజు, యువరాజు, సరస్వతి, ఆర్పీలు, టీఎల్‌ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను సంబురంలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, అధికారులందరూ సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రత్యేకాధికారి అనిల్‌ప్రకాష్ అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నర్సింగ్‌రావుతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యాదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్ 2న జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను చేపట్టాలని, జూన్ 22వ తేదీ వరకు 21 రోజుల పాటు ప్రభుత్వం సూచించిన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

పాన్‌గల్: జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను మండలంలో విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ చక్రపాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాల్‌లో దశాబ్ది ఉత్సవాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ మండలంలోని ప్రతి గ్రామంలో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జూన్ 2వ తేదీన అన్ని గ్రామాల్లో పతాకావిష్కరణ చేయాలని సూచించారు. 3వ తేదీన రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, రైతువేదికలను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. జూన్ 18వ తేదీన ఊరూరా చెరువుల పండుగ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, పీఆర్ ఏఈ సత్తయ్య పాల్గొన్నారు.



పాన్‌గల్ రైతువేదిక ఆవరణలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న అధికారులు

రైతు దినోత్సవంగా నిర్వహించాలి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 3వ తేదీన నిర్వహించే రైతు దినోత్సవాన్ని మండలంలోని అన్ని క్లస్టర్లల్లో ఘనంగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి, ఏఓ సాజీద్ రహమాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మండల కేంద్రంతో పాటు రేమద్దుల, మాందాపూర్, కేతేపల్లి, మల్లాయిపల్లి రైతువేదికల క్లస్టర్ల పరిధిలో సమావేశాలు నిర్వహిలన్నారు. ఏఈఓ లింగస్వామి, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు చారిత్రాత్మక ఘట్టాలుగా నిలిచిపోతాయని రైతుబంధు మండల అధ్యక్షుడు హన్మన్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై రైతులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్ర, రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌నారాయణ, అనంత జయంతి, కురుమయ్య, మాజీ ఎంపీపీ మహాదేవన్‌గౌడ్, రామచంద్రి తదితరులు ఉన్నారు.



మదనాపురంలో..



ఆత్మకూర్ మాట్లాడుతున్న అధికారి అనిల్‌ప్రకాష్



వనపర్తిలో..

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో మంగళవారం ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెలగొండకు చెందిన పద్మాచారి, వారి కుటుంబ సభ్యులతో కలిసి పాతపల్లి సమీపంలోని చింతలకుంట ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గోవర్ధనగిరి సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. దీంతో ట్రాలీలో ఉన్న పద్మాచారి కుటుంబ సభ్యులు, బంధువులు ట్రాలీపై నుంచి చెల్లాచెదురుగా పడిపోయారు. దీంతో డ్రైవర్ బాల్‌రాంకు స్వల్పగాయాలు అయ్యాయి. అదృష్టవశాత్తు ట్రాలీలో ఉన్న వారంతా ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

పాన్‌గల్: ఖాళీ ట్రాక్టర్ బోల్తాపడిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిక్కేపల్లికి చెందిన శివ గ్రామం నుంచి వరిగడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ తీసుకెళ్లి తిరుగు ప్రయాణంలో సొంత గ్రామానికి వెళ్తున్న క్రమంలో సోమవారం రాత్రి బుసిరెడ్డిపల్లి చెరువు కట్ట మలుపు వద్ద ఖాళీ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ శివకు చేతికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.



గోవర్ధనగిరి సమీపంలో బోల్తా పడిన ట్రాక్టర్

కాంగ్రెస్ నుంచి సతీష్ బహిష్కరణ

వనపర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ కౌన్సిలర్ సతీష్‌యాదవ్‌ను బహిష్కరిస్తున్నట్లు డీసీసీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కాంగ్రెస్ తరుపున అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఏడాది కాలంగా పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్టీకి నష్టం కలిగే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పలుమార్లు సూచించినా.. ఆయన తీరు మారలేదని, తప్పనిసరి పరిస్థితుల్లో పార్టీ క్రమశిక్షణ కమిటీ ఆదేశం మేరకు సతీష్‌యాదవ్‌ను సస్పెండ్ చేశామన్నారు. కాగా సతీష్‌యాదవ్ కొన్ని నెలలుగా అఖిలపక్షం ఐక్యవేదిక పేరుతో పలు కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నారు.

నన్ను సస్పెండ్ చేయలేరు


కాంగ్రెస్ పార్టీలోకి తనను మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి తీసుకొచ్చారని, తనను పార్టీలో నుంచి సస్పెండ్ చేసే అధికారం జైపాల్‌రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికే ఉందని మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనను సస్పెండ్ చేసే అధికారం చిన్నారెడ్డికి, డీసీసీ అధ్యక్షుడికి లేదని ఎద్దేవా చేశారు.

రైతుల సంక్షేమం కోసమే పథకాలు

ఖిల్లాఘనపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల అభివృద్ధి కోసమే దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నారని మండల రైతు సమితి కోఆర్డినేటర్లు తిరుపతయ్యయాదవ్, వెంకటేశ్వర్‌రావు, మండల సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అప్పారెడ్డిపల్లి క్లస్టర్ పరిధిలో రైతువేదిక వద్ద రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతుబంధు, రైతుబీమా పథకాలు రైతులకు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయన్నారు. వలసల జిల్లా పాలమూరుకే ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడి ఎంతో మంది వలస వచ్చే పరిస్థితి నెలకొందని చెప్పారు. చుక్క నీరు లేని ప్రాంతాల్లోనూ తెలంగాణ కల సాకారమయ్యాక ఏడాదికి రెండు పంటలు పండించేలా సాగునీరు కాల్వల ద్వారా అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు కృష్ణవేణి, శేషయ్య, మండల ప్రధాన కార్యదర్శి పురేందర్‌రెడ్డి, విక్రం, మల్లారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్‌గౌడ్, కృష్ణయ్య, శేషయ్య, చెన్నయ్య, తిర్మలేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, రైతు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ అనెమోని కృష్ణవేణి అన్నారు. మంగళవారం అప్పారెడ్డిపల్లిలో కంటివెలుగు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యురాలు డాక్టర్ ఆయేషా మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 157 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో 46 మందికి కంటి అద్దాలు అందించడంతో పాటు ఐదుగురికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌బీ, డీఈఓ శ్రవణ్, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, సుమల పాల్గొన్నారు.



రైతుల భూమి వేలం పాట ఆపాలి

ఆత్మకూర్: రైతులు తమ భూములు తాకట్టు పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారని, నష్టాల ఊబిలో పడ్డ రైతుల భూముల వేలం పాటను రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్, సీపీఐఎంఎల్ ప్రజాపంథా కార్యదర్శి ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని మోట్లంపల్లికి చెందిన కావలి పెద్దరాములు స్థానిక డీసీసీ బ్యాంకులో దీర్ఘకాలిక రుణం పొంది గొర్రెలు తీసుకోగా.. వింత వ్యాధితో అవి చనిపోయాయని వాపోయారు. ఇంతలోనే బ్యాంకు అధికారులు భూమిని వేలంపాట నిర్వహిస్తున్నామని నోటీసులు ఇవ్వడం సబబు కాదని, అవమానంతో రైతు కుటుంబం అఘాయిత్యానికి పాల్పడక ముందే వేలంపాటను విరమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహయ్యశెట్టి, వెంకటన్న, లింగన్న ఉన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వీడాలి

వనపర్తి టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అలసత్వం వీడాలని ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ కార్యాలయంలో బొల్లి వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన మాదిగ ఉద్యోగుల సమాఖ్య ముఖ్య నాయకుల సమావేశానికి గద్వాల కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ ఇచ్చి, విద్యారంగంలో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల, మండల విద్యాధికారుల, జేఎల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, పీఆర్సీ, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల టీఎస్‌జీఎల్‌ఐ ఆమోదం తక్షణమే విడుదల చేయాలని కోరారు.



పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఆత్మకూర్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ ప్రకారం రూ.19,500 వేతనాలు ఇవ్వడంతో పాటు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, కొండన్న, దేవన్న, అలివేలమ్మ, రాములు, వెంకటేష్, కుర్మన్న ఉన్నారు.

అమరచింత: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ఐఎఫ్‌టీయూ నాయకులు ప్రసాద్, రాజు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చాలిచాలనీ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులతో పాటు వాటర్‌మెన్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటన్న, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేసే సిబ్బంది కోరారు. మంగళవారం జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీ పోరాటాల్లో భాగంగా వారు ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

పేదలందరికీ సాయం అందించాలి

వనపర్తి టౌన్: సీఎం కేసీఆర్ కులవృత్తుల వారికి రూ.లక్ష అందిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు నియోజకవర్గంలో 1,200 – 1,500 మంది మాత్రమే ఇవ్వాలనే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని జిల్లా విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు పరమేశ్వరాచారి కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం ఆలోచనతో బీసీల్లో ఉండే కొన్ని వర్గాల్లోని కొంత మందికే మాత్రమే న్యాయం జరుగుతుందని, మిగతా వారు లబ్ధి పొందలేరని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాధవాచారి, సత్యనారాయణ చారి, గంగాధరాచారి, అశోక్ చారి, నవీన్ చారి, రమేష్ చారి, సుదర్శన చారి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం కొత్తకోటలోని కృష్ణారెడ్డి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కలిసి విద్యను అభ్యసించి వివిధ ప్రదేశాల్లో స్థిరపడి కొన్నేళ్ల తరువాత ఒకచోట చేరి వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యను బోధించిన ఆనాటి గురువులకు శాలువా పూలదండాలతో సత్కరించారు. కార్యక్రమంలో శశికుమార్, రంజిత్‌రెడ్డి, రాజగౌడ్, పరమేష్, గజేందర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, రాము, సరిత, శ్రీవాణి, శ్రీదేవి, సుచరిత పాల్గొన్నారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

కొత్తకోట: మండలంలోని ఈదులబాయితండా ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న 11మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో ప్రవేశానికి అర్హత పరీక్షలు రాయగా సోమవారం వెలువడిన ఫలితాల్లో 9మంది ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌గౌడ్ తెలిపారు. రెండేళ్లుగా తమ పాఠశాల నుంచి విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడం సంతోషకరమని హెచ్‌ఎం అన్నారు. ఎంపికైన విద్యార్థులను తండావాసులతో పాటు హెచ్‌ఎం అభినందించారు.

ఆత్మకూర్: పట్టణానికి చెందిన విద్యార్థులు భవ్యశ్రీ, సిగ్నిత, షారూన్, మేఘన, నిఖిల్‌నాయక్ గురుకులాలకు ఎంపికయ్యారని లిటిల్‌ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మీర్జాఅన్వర్‌బేగ్, మీర్జాఅక్తర్ బేగ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్థానికులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు గురుకుల పాఠశాలలో చదివేందుకు అర్హత పరీక్షలు రాశారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 40మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికై నట్లు మండల విద్యాధికారి జయశంకర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లోనూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నామని, పెద్దమందడి మండలంలో 40మంది విద్యార్థులకు గురులకుల పాఠశాలలో సీట్లు రావడం అభినందనీయమని ఎంఈఓ అన్నారు.



విజయ సంకేతం చూపిస్తున్న ఈదులబాయితండా పాఠశాల విద్యార్థులు

అమరచింత: పట్టణానికి చెందిన విద్యార్థులు నందిని, శివాణి, స్నేహ, రాఘవేంద్ర, రోహిత్, స్నేహ, శివ మహాత్మా జ్యోతిబాయి పూలే గురుకుల కళాశాలలకు ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు సీవోయి గొలిదొడ్డి, చిట్యాల, కల్వకుర్తి, వెల్టూర్‌లలోని గురుకుల కళాశాలలకు ఎంపికయ్యారు. వీరు పట్టణానికి చెందిన సయ్యద్‌రాజిక్ నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్ శిక్షణ పొందారు.

కార్మిక హక్కుల కోసం ఉద్యమాలు

వనపర్తి: పట్టణ కేంద్రంలో మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

అమరచింత: కార్మిక హక్కుల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరంతరం ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్న ఏకైక కార్మిక సంఘంగా సీఐటీయూకే గుర్తింపు దక్కిందని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్ అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 137 ఏళ్ల కిందట ఎనిమిది గంటల పనిదినం కోసం పోరాడి సాధించుకున్న ఘనత కార్మికులకు దక్కిందన్నారు. దేశంలో పేదరికంతో 2014లో 20 కోట్ల మంది ఉంటే నేడు 46కోట్ల మంది భారతీయులు చేరారని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలపై జీఎస్టీ పేరుతో అన్ని రకాల సరుకులపై ధరలు పెంచారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వెంకటేష్, నర్సింహ, ఆశిరెడ్డి, టీవీ గోపి, రమేష్, రవి, ఆటో శేఖర్, వెంకటేష్, శ్యాంసోన్, సునీల్, రాఘవేంద్ర, రాఘవ, రమేష్ పాల్గొన్నారు.



మదనాపురంలో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న గోపాల్

మదనాపురం: మండల కేంద్రంలో మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలి కార్మిక సంఘం అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు నిక్సన్ సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మికులకు, నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నరేందర్, అలివేల, జయమ్మ, సంధ్య, రజిత, పద్మ పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

కొత్తకోట: పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్లు రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్‌అలీకి వినతి పత్రం అందజేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళవారం ఎస్పీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి వెళ్తున్న హోం మంత్రిని స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పట్టణ శివారులో గల సర్వేనంబర్ 148లో గల 16గుంట భూమిలో నూతనంగా ఫైర్ స్టేషన్ నిర్మించేందుకు మున్సిపాలిటీ తీర్మాణం ఇచ్చారని వివరించారు.



హోం మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

హోం మంత్రిని కలిసిన వారిలో గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, సాక బాలనారాయణ, రాములుయాదవ్, అల్లబాషా, సత్యంయాదవ్, వినోద్‌సాగర్, మహేష్, గణేష్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



స్వామివారి అభిషేకానికి నీటిని తెస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చీకరుచెట్టుతండాలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఇళ్ల నుంచి ఊరేగింపుగా నీటిని తెచ్చి స్వామివారికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధాకృష్ణ, ఉప సర్పంచ్ రమేష్‌నాయక్, మోహన్‌బాబు, గోపాల్, రెడ్యా, కృష్ణ, సేవ్యా, శంకర్, పాండు, సునీల్‌నాయక్, ఫుల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆధార్' అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు చేయండి

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు నిర్వహణపై సరైన అవగాహన లేకపోవడం, కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు గ్రామాల్లో చాటింపు వేయించకపోవడం, ప్రతి జీపీలో ఒకే రోజు నిర్వహణతో చాలా మంది ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో తమ ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకునేందుకు మండల కేంద్రం, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి దాపరించిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రతి జీపీలో మరోమారు ఆధార్ అప్‌డేట్ కేంద్రాల నిర్వహణ చేపట్టి ఇబ్బందులను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణిని వివరణ కోరగా.. చాలా మంది లబ్ధిదారులు ఆధార్ అప్‌డేట్ చేసుకోలేదనే విషయం మా దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరో మారు గ్రామాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.